RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 14 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శుక్రవారం 17-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్16 : కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతితి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతోపాటు క్షతగాత్రులకు ఆయన నష్ట పరిహారాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఈ నష్ట పరిహారాన్ని అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. మంత్రాలయంలో కొలువుదీరిన శ్రీరాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక వాసులు బొలెరో వాహనంలో వెళ్తున్నారు.



2వ పేజీలో...

## అమెరికా స్థావరాలపై.. ఇరాన్ నిఘా

### సాయం చేసిన.. చైనా శాటిలైట్!

- గతేడాది రహస్యంగా శాటిలైట్‌ను సమకూర్చుకున్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- సౌదీ, జోర్డాన్, ఇరాక్‌లోని యూఎస్ బేస్‌ల కదలికలను ట్రాక్ చేసిన వైనం
- చైనా ప్రభుత్వ అనుమతితోనే ఇది జరిగిందంటున్న నిపుణులు
- ఇరాన్‌కు సైనిక సాయం లేదంటూ కొట్టిపారేస్తున్న చైనా

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### 8 మంది భక్తుల మృతి



- మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన రెడీమిక్స్ లారీ
- ఘటనలో 8 మంది కర్ణాటక భక్తులు అక్కడికక్కడే మృతి
- మరో 12 మందికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తుండగా ఘటన

కర్నూలు జిల్లా : కర్నూలు జిల్లా మంత్రాలయం మండలంలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీ రాఘవేంద్రస్వామి వారి దర్శనానికి వెళుతున్న భక్తుల వాహనం ప్రమాదానికి గురవడంతో 8 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు.



2వ పేజీలో...



## దేశ అభివృద్ధికి మహిళలే.. కీలకం

ఢిల్లీ: నారీ శక్తికి పెద్దపీట వేస్తూ, భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత రాజకీయ యవనికపై ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. మహిళా రిజర్వేషన్ల కోసం ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (నారీ శక్తి వందన్ అభియాన్)పై లోక్‌సభలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. దేశ భవిష్యత్తును మార్చే ఈ అడుగు 25-30 ఏళ్ల క్రితమే పడాల్సిందని, అయితే కాలం ఆ బాధ్యతను తమ ప్రభుత్వానికి అప్పగించిందని ఆయన ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ తన ప్రసంగంలో "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్" మంత్రాన్ని స్మరిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశం అంటే కేవలం రోడ్లు, రైల్వేలు మాత్రమే కాదని, దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు విధాన రూపకల్పనలో భాగస్వామ్యం కల్పించడమేనని స్పష్టం చేశారు. "మహిళలకు కేవలం ప్రాతినిధ్యం మాత్రమే కాదు, నిర్ణయాధికారం ఉండాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో మహిళా హక్కులను అడ్డుకున్న వారిని చరిత్ర క్షమించదని హెచ్చరిస్తూనే, ఈ బిల్లు ఆమోదాన్ని ఏ ఒక్క పార్టీ రాజకీయ లబ్ధిగా చూడవద్దని ప్రధాని కోరారు. 30 ఏళ్ల క్రితం మహిళలు మౌనంగా ఉండేవారని, కానీ నేడు లక్షలాది మంది మహిళలు క్షేత్ర స్థాయిలో నాయకులుగా ఎదిగి తమ గళాన్ని వినిపిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన తనకు దేశం ఇంతటి బాధ్యత తను అప్పగించడమే రాజ్యాంగం గొప్పతనమని, అదే రాజ్యాంగ స్ఫూర్తితో మహిళా శక్తిని చట్టసభలకు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. 21వ శతాబ్దపు భారతదేశం ప్రపంచవ్యాప్త ఆమోదాన్ని పొందుతోందని, మన ఆడబిడ్డలు ప్రతి రంగంలోనూ అద్భుతాలు చేస్తున్నారని ప్రధాని కొనియాడారు. "మహిళలు మన నిర్ణయాల కంటే మన ఉద్దేశాలను ఎక్కువగా గమనిస్తారు. అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని అంగీకరించాల్సిన సమయం ఆసన్నమైంది" అని ఆయన పిలుపునిచ్చారు.

- మహిళలకు నిర్ణయాధికారం ఉండాలనేదే మా లక్ష్యం
- నారీ శక్తి వందన్ అభియాన్‌తో చరిత్ర సృష్టి
- క్రెడిట్ మాకేం అవసరం లేదు..
- లోక్‌సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

2వ పేజీలో...



2వ పేజీలో...

## 'తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ'

### బీజేపీ ఎంపీపై మంత్రి పొన్నం ఫైర్

హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ లోక్ సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ అని ఘాటు వ్యాఖ్యలతో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన రాష్ట్ర ఏర్పాటుపై అజ్ఞానంగా మాట్లాడారని అతడి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పొన్నం.. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. తేజస్వీ మాటలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు తెలంగాణ బిడ్డలైతే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇది ఏ ఒక్కరికో అవమానం కాదని ఇది మన ఉద్యమాన్ని, మన రాష్ట్రాన్ని అమానించడమేనన్నారు. మరొకరు తెలంగాణ ఏర్పాటుపై నోరువిప్పే ధైర్యం చేయకుండా చట్ట ప్రకారం బుద్ధి చెప్పాల్సి ఉందన్నారు. దీనిపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలన్నారు. తేజస్వీ సూర్యపై చర్య తీసుకోవాలని లోక్ సభ స్పీకర్ కు లేఖ రాస్తున్నట్లు చెప్పారు.



2వ పేజీలో...

## 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

న్యూఢిల్లీ, ఏప్రిల్16 : చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు.

- కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా



## చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

- లోక్‌సభలో మహిళాబిల్లు, డీలిమిటేషన్ బిల్లులు
- డివిజన్ కోరిన విపక్ష సభ్యులు..స్పీకర్ అంగీకరాం
- సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ,ఏప్రిల్16 : దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు గురువారం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టు బట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు.

2వ పేజీలో...

హైదరాబాద్, ఏప్రిల్16 : ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కొలిమిగా మారాయి. గత నెల రోజులుగా ఆయా ప్రాంతాల్లో విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. కొన్ని చోట్ల అకాల వర్షాలు, పలుచోట్ల వడగళ్ల వర్షం, చూసాం. ఇప్పుడు ఉన్నట్టుండి వడగాడ్పులు చప్పుడు వింటున్నాం. భానుడి భగభగలతో జనం మిట్ట మధ్యాహ్నం బయటకు వెళ్ళ లేక ఉన్న చోటనే ఇంట్లోనో, కార్యాలయంలోనో ఉండిపోతున్నారు. తెలంగాణలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది.



## నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితం అయిన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

2వ పేజీలో...

# అమెరికా స్థావరాలపై ఇరాన్ నిఘా..



మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,: పశ్చిమాసియాలో ఇటీవల ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో అమెరికా సైనిక స్థావరాలపై నిఘా పెట్టేందుకు ఇరాన్ చైనా తయారీ శాటిలైట్‌ను ఉపయోగించుకుందని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ పరిణామం గల్ఫ్ దేశాల్లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం, గతేడాది ఇరాన్ రహస్యంగా పొందిన ఈ శాటిలైట్ పేరు TEE-01B. దీనిని చైనాకు చెందిన 'ఎర్త్ ఐ కంపెనీ' అభివృద్ధి చేసి ప్రయోగించింది. అనంతరం ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఏరోస్పేస్ విభాగానికి దీనిని అప్పగించారు. కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాతే విదేశీ కొనుగోలుదారులకు ఉపగ్రహాలను బదిలీ చేసే 'ఇన్-ఆర్బిట్ డెలివరీ' అనే పద్ధతిలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బీజింగ్‌కు చెందిన ఎంపోశాట్ అనే మరో సంస్థకు చెందిన కమర్షియల్ గ్రౌండ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను కూడా ఇరాన్ వినియోగించుకునేందుకు అనుమతి లభించింది. ఈ శాటిలైట్‌ను ఉపయోగించి పశ్చిమాసియాలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిఘా పెట్టింది. మార్చి 13, 14, 15 తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ చిత్రాలను ఈ శాటిలైట్ బంధించింది. అదే సమయంలో జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్‌లోని ఎర్బిల్ ఎయిర్‌పోర్ట్ వద్ద కార్యకలాపాలను కూడా ట్రాక్ చేసినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. కువైట్‌లోని క్యాంప్ బ్యూహ్రింగ్, అలీ అల్ సేలం ఎయిర్ బేస్ వంటి అమెరికా సంబంధిత స్థావరాలు కూడా దీని నిఘా నీడలోనే ఉన్నాయి. "చైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ చైనా కంపెనీ ఇలాంటి ఉపగ్రహాన్ని ప్రయోగించడం అసాధ్యం. చైనా చాలా కాలంగా ఇరాన్‌కు నిఘా సమాచారంతో సాయం చేస్తోంది, అయితే ప్రభుత్వ ప్రమేయం బయటపడకుండా జాగ్రత్త పడుతోంది" అని పాశ్చాత్య దేశాలకు చెందిన ఓ మాజీ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి వ్యాఖ్యానించారు. అయితే, ఇరాన్‌కు ఎలాంటి సైనిక మద్దతు ఇవ్వడం లేదని చైనా విదేశాంగ శాఖ గత కొన్ని రోజులుగా ఖండిస్తూ వస్తోంది. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి మద్దతు ఇస్తోందని, క్షిపణుల తయారీకి ఉపయోగపడే ద్వంద్వ వినియోగ పారిశ్రామిక భాగాలను అందిస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా-ఇరాన్ బంధంపై గల్ఫ్ దేశాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

మొదటిపేజీ తరువాయి...

కొన్ని ప్రాంతాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఎండ వేడిమి నుండి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఏప్రిల్ 19 నుంచి మే 31 వరకు ప్రత్యేక వాతావరణం చూస్తామని ఈ కారణంగా కొన్ని కఠినమైన పరిస్థితులు ఎదురవుతా యని వాతావరణ శాఖ అలర్ట్ చేసింది. వడగాలులు సాధారణ రోజుల కన్నా ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతమైన కోస్తా జిల్లాల్లో వడగాలు పలు ప్రభావం నుంచి బయటపడే ఆలోచన చేయాల్సి ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో కనీసం ఐదుగురు వడగాల్పులకు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉష్ణోగ్రత 45 డిగ్రీల నుండి 55 డిగ్రీల వరకు అత్యధిక వేడిమి ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో డాక్టర్లు, శాస్త్రజ్ఞులు సైతం మానవ సహిత జీవజాలాన్ని, జంతు జాలాన్ని వేడివాతావరణంలో ఎలా రక్షించుకోవాలో, సూచిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఎవరూ బయటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉక్కపోత అధికం గా ఉంటుందని, గాలిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు 35డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉన్నప్పుడు బయట ఎక్కువసేపు తిరిగే వారిలో డీహైడ్రేషన్, తలనొప్పి, తల తిరగడంవంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఎండల ధాటి 40-45



డిగ్రీలకు చేరుకుంటే, ప్రమాద స్థాయి మరింతగా పెరుగుతుంది. గడచిన పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో సగటు గరిష్టఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదవుతున్నాయి.

విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45-47డిగ్రీల వరకు కూడా నమోదవుతున్నాయి. అందువల్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తాకినప్పటి నుంచి తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించడం మంచిది. ఎల్నినో కాస్త ముందే పలుకరించినా భూమధ్య రేఖ వెంబడి పసిఫిక్ మహా సముద్రం వేడెక్కుతుంది. చివరిసరిగా ఎల్నినో పరిస్థితులు 2023లో ఏర్పడ్డాయి. ఈ ఏడాదిరుతుపవనాల సమయంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ చెబుతోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో నీటి వనరులకు కొరత ఏర్పడుతుంది.

# చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి...

మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించ నున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతో పాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. ఇక, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. వీటిపై లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఈ సాయంత్రం లోక్‌సభలో ప్రసంగిస్తారు. ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

మొదటిపేజీ తరువాయి...

రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది.మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

**మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ అక్కసు**

న్యూఢిల్లీ,ఏప్రిల్16 : పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

# 'తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ'

మొదటిపేజీ తరువాయి...

పుండుమీద కారం చల్లొద్దు: తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అంటే తల్లిని అమానించడమేనన్నారు. నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి ఇవాళ తెలంగాణ తల్లిని అవమానిస్తే మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు. ప్రధాని మోడీ, అమిత్ షా, ఇప్పుడు తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై తప్పుడుగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా ఓ టీడీపీ ఎంపీ సైతం ఇదే రకంగా మాట్లాడారని ఇటువంటి అజ్ఞానులు, ధన బలం, మందబలంతోనో పార్లమెంట్‌కు వస్తే అలాంటి వారి పార్టీ అయినా బుద్ధి చెప్పాలి కదా అన్నారు. సహృద్భావ వాతావరణంలో బతకాల్సిన పరిస్థితుల్లో తెలంగాణ ఏర్పాటుపై అనుచితంగా మాట్లాడుతూ పుడుమీద కారం చల్లినట్లు వ్యవహిస్తున్నారని మండిపడ్డారు.

# మంత్రాలయం ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

మొదటిపేజీ తరువాయి...

ఈ వాహనం ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించారు. 13 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలికలు ఉన్నారు. వీరంతా కర్ణాటకలోని చిక్‌మంగళూరు వాసులని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఘటనపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# దేశ అభివృద్ధికి మహిళలే కీలకం

మొదటిపేజీ తరువాయి...

ఈ చారిత్రాత్మక నిర్ణయం దేశానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని, ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా నారీ శక్తికి సముచిత స్థానం కల్పించడమే తమ సంకల్పమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

"మనం దేశ నారీ శక్తిని అణచివేస్తున్నామనే భ్రమలో గానీ, అహంకారంలో గానీ ఉండవద్దు, ఇది వారి హక్కు. మనం దశాబ్దాలుగా వారిని అణచిపెట్టాము, ఆ పాపం నుండి మనల్ని మనం విముక్తి చేసుకోవడానికి ఇది ఒక అవకాశం." అని ప్రధాని మోదీ అన్నారు. ఈ రోజు దేశవ్యాప్తంగా మహిళలు గళం విప్పుతున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్షం అనే తేడా లేకుండా, పంచాయతీలకు ప్రాతినిధ్యం వహించి, ప్రజల సుఖదుఃఖాలను చూసిన లక్షలాది సోదరీమణులు ఆందోళన చెందుతున్నారని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "దీని వెనుక మోదీకి రాజకీయ ఉద్దేశం ఉందని కొందరు అనుకుంటున్నారు. మీరు దీనిని వ్యతిరేకిస్తే, నాకు సహజంగానే రాజకీయంగా లాభం చేకూరుతుంది, మనం దీనికి మద్దతు ఇస్తే ఎవరికీ నష్టం జరగదు." అని అన్నారు. "మాకు క్రెడిట్ అక్కర్లేదు. బిల్లుఆమోదం పొందినవెంటనే, ఒక ప్రకటన ఇచ్చి అందరి కీ ధన్యవాదాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను. క్రెడిట్ కోసం మీకు ముందే ఒక బ్లాంక్ చెక్ ఇస్తున్నాను." అని ప్రధాని మోదీ తెలిపారు.

# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి...



ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన కొందరు భక్తులు బొలెరో వాహనంలో మంత్రాలయం బయలుదేరారు. వీరి వాహనం చిలకలడోన గ్రామ సమీపానికి రాగానే, ఎదురుగా వస్తున్న రెడీమిక్స్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బొలెరో వాహనం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారిని, గాయపడిన వారిని కర్ణాటక వాసులుగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్వామి దర్శనానికి వెళ్తూ భక్తులు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వ్యాధుల నియంత్రణలో భాగంగా..

# దోమల వృద్ధిని అరికట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల (తెలంగాణ వాణి): వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా.వేదవ్యాస్ టి హబ్ ప్రతినిధి డా.శిల్ప లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు జిల్లాలో వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని దోమలు టిక్స్ ఫ్లీలు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా డెంగ్యూ ఫైలేరియా వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు వైద్య శాఖ ముందుండి చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా మండల స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సరిపడా నిధులు అందుబాటులో ఉన్నాయని సరైన విధంగా వినియోగించాల్సిన అవసరం ఉందని గ్రామాలు పట్టణాలలో గుంతలు పూడ్చడం మురుగు కాలువలు శుభ్రపరచడం నిల్వ నీరు తొలగించడం వంటి పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బంది తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కార్మికులను వినియోగించి పనులను కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు సంక్షేమ వసతి గృహాలలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టి నెలవారీ ప్రణాళికను అమలు చేయాలని జూన్ 12న విద్యా సంవత్సరం పునఃప్రారంభమయ్యే నేపథ్యంలో పాఠశాలలలో 2 3 రోజుల ముందు శుభ్రపరిచే పనులు పూర్తి చేయాలని విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యంగా నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, జూన్ 5వ తేదీ నుండి 15వ తేదీ వరకు మరొక దశలో వైద్య శాఖ చర్యలు కొనసాగించాలని తెలిపారు జిల్లాలో మందులు ద్రావణాలు పడకలు సమృద్ధిగా ఉన్నాయని మండల స్థాయిలో సిబ్బంది రోగులకు తగిన సేవలు అందించాలని ఆదేశించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కీటక దళిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం



దోమల వృద్ధిని అరికట్టడం దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడం కొరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠశాలలలో దోమల మందు పిచికారి చేయాలని నివాసాలలో దోమతెరలు ఇంటి కిటికీలకు జాలీలు వాడటం ఇంటి ఆవరణలో నీళ్ళకుండీలు బావుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బోదకాలు నివారణకు జిల్లాలో సంవత్సరానికి ఒక మోతాదు డిఇసి మాత్రలు వాడడం వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తుందని జిల్లాలో కీటక జనతా వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టడంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లాలోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జిల్లాలో వైద్య శిబిరమును ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి తగు వైద్య చికిత్స అందించాలని తెలిపారు. వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మధ్యాహ్నము 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆ సమయంలో ప్రజలు బయటకు రాకుండా ఉండేలా వివరించాలని అన్ని గ్రామాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగినదని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు తెల్లటి నూలు వదులు దుస్తులు ధరించాలని తలపై టోపీ రుమాలు ధరించాలని ఉదయం 11 గంటల లోపు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే ఆరు బయట పని చేసుకోవాలని వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని గాలి ఉన్న నీడ ప్రదేశానికి చేర్చాలని 108 ద్వారా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనంతరం కార్యక్రమాల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రశాంతి సబ్ యూనిట్ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు ఎం.టి.ఎస్. శ్రీనివాస్ కిరణ్ ఆర్ఎస్ పద్మ వసుమతి జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్లమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# నేడు భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి



- మహనీయుని సేవలను స్మరించుకుందాం
- భారతదేశపు తొలి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి ప్రస్థానం
- విద్యావేత్తగా, తత్వవేత్తగా ప్రపంచవ్యాప్త గుర్తింపు
- నేటి తరానికి స్ఫూర్తిదాయకమైన ఆయన సిద్ధాంతాలు ఆశయాలు

భారతదేశం గర్వించదగ్గ గొప్ప విద్యావేత్త, తత్వవేత్త మరియు రాజకీయ ధురీణుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని పురస్కరించు కుని దేశవ్యాప్తంగా నివాళులు అర్పించనున్నారు. 1975 ఏప్రిల్ 17న ఆయన తుదిశ్వాస విడిచారు. స్వతంత్ర భారత తొలి ఉపరాష్ట్రపతిగా మరియు రెండవ రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలు అజరామరం. రాజనీతిజ్ఞుడిగానే కాకుండా, భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రపంచ వేదికలపై సగర్వంగా చాటిచెప్పిన మేధావిగా ఆయన చరిత్ర లో నిలిచిపోయారు. రాధాకృష్ణన్ గారు ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత పదవిని అధిష్టించారు. విద్యపై ఆయనకున్న మక్కువ, ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆయనకున్న గౌరవం కారణంగానే ఆయన పుట్టినరోజును మనం 'ఉపాధ్యాయ దినోత్సవం'గా జరుపుకుంటున్నాము. జ్ఞాన సముపార్జన మాత్రమే కాకుండా, విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించాలని ఆయన ఎప్పుడూ ఆకాంక్షించేవారు. ఆయన రచించిన అనేక గ్రంథాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా తత్వశాస్త్ర విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. ఆయన మేధోసంపత్తిని గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించింది. కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆయనకు ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేసి, పాశ్చాత్య దేశాలకు భారతీయ వేదాంతం మరియు సంస్కృతిని పరిచయం చేసిన గొప్ప సంస్కర్త ఆయన. వినయం మరియు విజ్ఞానం కలగలిసిన అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్య ఎంత అవసరమో ఆయన ఆనాడే గుర్తించారు. పుస్తక జ్ఞానం కంటే అనుభవ జ్ఞానం మరియు మానవత్వానికి ఆయన ప్రాధాన్యతనిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మరియు భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడంలో ఆయన చూపిన చొరవ అనన్యసామాన్యం. ఆయన వర్ధంతి సందర్భంగా విద్యా సంస్థలు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన త్యాగాలను మరియు కృషిని స్మరించుకుంటారు. భారతదేశం విదేశీ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత, దేశాన్ని పునర్నిర్మించడంలో రాధాకృష్ణన్ గారి పాత్ర ఎంతో కీలకమైనది. రష్యాలో భారత రాయబారిగా ఆయన చేసిన సేవలు అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేశాయి. సంక్లిష్టమైన దౌత్యపరమైన సమస్యలను సైతం ఆయన తనదైన శైలిలో, ప్రశాంతంగా పరిష్కరించేవారు. ఆయన మాట తీరు, ఎదుటివారిని ఆకట్టుకునే గుణం ఆయనను ఒక గొప్ప నాయకుడిగా నిలబెట్టాయి.

తత్వశాస్త్రంపై ఆయన రాసిన రచనలు భారతీయుల ఆధ్యాత్మిక చింతనను శాస్త్రీయ దృక్పథంతో జోడించాయి. ముఖ్యంగా హిందూ ధర్మంపై ఆయన చేసిన విశ్లేషణలు పాశ్చాత్య దేశాల్లో ఉన్న అపోహలను తొలగించాయి. మానవత్వం మరియు మత సామరస్యం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయం. మనిషి కేవలం భౌతిక సంపదతోనే కాకుండా, ఆధ్యాత్మిక వికాసంతోనే పరిపూర్ణమవుతాడని ఆయన ప్రగాఢంగా విశ్వసించేవారు. రాధాకృష్ణన్ గారి ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో కూడిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి. కేవలం పదవుల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం. నేటి విద్యా వ్యవస్థలో ఆయన చెప్పిన నైతిక విలువల ఆవశ్యకతను గుర్తించి, రాబోయే తరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. ముగింపుగా, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక వ్యక్తి కాదు, ఒక గొప్ప వ్యవస్థ. ఆయన వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయన స్మృతి చిహ్నాల వద్ద ప్రజలు ఘన నివాళులు అర్పించనున్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడం ద్వారా ఆయన కలలుగన్న నవభారతాన్ని సాధించవచ్చు. ప్రతి భారతీయుడు ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తామని ఈ సందర్భంగా సంకల్పం తీసుకోవాలి.

## 108 అంబులెన్స్ లో మహిళ ప్రసవం



జహీరాబాద్/టౌన్: ఏప్రిల్ 16(తెలంగాణ వాణి ప్రతినిధి): జహీరాబాద్ పట్టణం నాగుల కట్టకు చెందిన నందిని అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 కూ ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది ఈఎంటి సాయికుమార్, పైలట్ దయానంద్ సమాచారం అందుకొని అక్కడికి చేరుకుని పురిటి నొప్పుల తో బాధపడుతున్న మహిళను అంబులెన్స్ లో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ లోనే ఆమె ప్రసవించింది. మూడవ కాన్పులో పండంటి మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. ఈఎంటి సాయి కుమార్, పైలట్ దయానంద్ అంబులెన్స్ లోనే సదరు మహిళలకు పురుడు పోసారు. మాతా శిశువు ఇద్దరు క్షేమంగానే ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

## బాధితులకు కొండంత అండ భరోసా కేంద్రాలు





కరీంనగర్ (తెలంగాణ వాణి) లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షిత వాతావరణంలో సహాయం అందిస్తూ 'భరోసా' కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ అండ్ ఏసీబీ) చారు సిన్హా తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని భరోసా కేంద్రాన్ని ఆమె సందర్శించి, అక్కడి సేవలను సమీక్షించారు. కేంద్రంలోని విభాగాలను పరిశీలించిన ఆమె, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సక్రమ నిర్వహణపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఆలస్యం లేకుండా అందించాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పటిష్టమైన ఆధారాలు సేకరించాలని, బాధితులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం సమ యానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తం గా ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. 2024 డిసెంబరులో ప్రారంభ మైన ఈ కేంద్రం ద్వారా బాధితులకు ఒకేచోట అన్ని సేవలుఅందించడం అభినందనీయమన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్క నాటారు. ఈకార్యక్రమంలోఅదనపు డీసీపీ వెంకటరమణ,ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ రద్దు



రామకృష్ణాపూర్, ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి):జిల్లాలోని రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ కమిటీని రద్దు చేయడం జరిగిందని ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎరుకల బుచ్చిబాబు లు తెలిపారు. గురువారం రామకృష్ణాపూర్ పట్టణంలో ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రెస్ క్లబ్ పాత కమిటీని రద్దు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, క్లబ్ నియమ నిబంధనలను అనుసరిస్తూ, పాత కమిటీని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో మరల సర్వసభ్య సమావేశం నిర్వహించి, సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం కాలంగా క్లబ్ కు సహకరించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు, రాజకీయ, కుల, ప్రజా సంఘాల నాయకులకు, స్వచ్ఛంద, యువజన సంఘాల సభ్యులకు, పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎర్రవెల్లి శ్రీనివాస్, సాయి కుమార్, కూరపాటి శ్రీనివాస్, వేల్పుల కిరణ్, పిల్లి రవికిరణ్, డొలకల సంతోష్ కుమార్, గంజి సతీష్, బద్రి సంతోష్ కుమార్ లు పాల్గొన్నారు.

## శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (తెలంగాణ వాణి విలేకరి) తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్వజీవులకు ప్రాణాధారమైన గంగ నీరును ఒంటికాలు పై కఠోరమైన తపస్సుతో దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహర్షి భగీరథుడన్నారు. ఆ మహనీయుని జయంతి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు. హైద్రాబాద్ రవీంద్రభారతి లో ఈ నెల 23 వ తేదీన నిర్వహించే జయంతి ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, గ్రేటర్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం సగర, అంజయ్య నగర్ సగర సంఘం అధ్యక్షులు దిండి చెన్నయ్య సగర, అంజయ్య నగర్ సంఘం ఉపాధ్యక్షులు దిండి తిరుపతయ్య సగర, హాఫీజ్పేట్ సంఘం గౌరవాధ్యక్షులు సాయిబాబా సగర, సంఘం నాయకులు విద్యాసాగర్, కిషోర్ సగర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతే ఆర్టీసీ సిబ్బంది ప్రాధాన్యత కావాలి, ఖేడ్ డిఎస్పి వెంకటట్ రెడ్డి



సంగారెడ్డి: నారాయణఖేడ్ ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి) అరైవ్ ఆ లైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలోడిఎస్పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో అతివేగం ,నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు, ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

చౌటుప్పల్: కంటైనర్ బైకును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ఓ మహిళ మృతి చెందడంతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన ఇడం మల్లేష్ వివిధ కార్యక్రమాలకు వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రామన్నపేట మండలంలోని ఎన్నారం గ్రామంలో వంటలు చేసేందుకు యాదమ్మ అనే మహిళను తీసుకెళ్లాడు. పని ముగించుకొని అనంతరం మల్లేష్ ద్విచక్ర వాహనంపై యాదమ్మతో కలిసి చౌటుప్పల్ కు తిరుగు పయనమయ్యారు.

వీరు చౌటుప్పల్‌లోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో యాదమ్మ, మల్లేష్‌లు బైక్ పై నుండి ఎగిరి కింద పడిపోయారు. యాదమ్మ(50) కంటైనర్ లారీ టైరు కింద ఇరుక్కుపోగా అక్కడికక్కడే మృతి చెందింది. మల్లేష్(56)కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన యాదమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నర్సిరెడ్డిలు తెలిపారు.

# డీలిమిటేషన్-సమాఖ్య స్ఫూర్తికి విఘాతం!



కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్థానాల పునర్విభజన కోసం ప్రతిపాదిస్తున్న మూడు బిల్లులు పార్లమెంట్‌నే కాదు, దేశ భవిష్యత్తునే అనిశ్చితిలోకి నెట్టేలా ఉన్నాయి. సీట్ల పెంపు కోసం మోదీ సర్కార్ 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుంటున్నది. అందువల్ల హిందీ బెల్ట్‌లోని ఆరు రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 195 నుంచి 328కి పెరిగే అవకాశమున్నది. అదే సమయంలో దక్షిణాది ఐదు రాష్ట్రాల్లోని స్థానాలు 129 నుంచి 169కి పెరుగుతాయి. రెండింటి మధ్య వ్యత్యాసం మరింత పెరిగి 160 స్థానాల తేడాగా మారుతుంది. దేశంలో లోక్‌సభ స్థానాల పెంపు దిశగా కసరత్తు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నేటి (16-04-26) నుంచి మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నది. ఈ సమావేశాల్లో మూడు బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేసింది. వాటిలో మొదటిది, కీలకమైనది రాజ్యాంగ సవరణ బిల్లు. దీనిని మనం తల్లి బిల్లు అని పిలవవొచ్చు. ఈ బిల్లు ప్రకారం ప్రజల సభగా పేర్కొనే లోక్‌సభలో వివిధ రాష్ట్రాల్లోని నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యే సభ్యుల సంఖ్య 815కు మించకూడదు. కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం వహించే సభ్యుల సంఖ్య 35గా ఉండవచ్చు. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపునకు రంగం సిద్ధం చేసిన కేంద్రం, జనాభా అనే మాటకు కూడా అర్థాన్ని నిర్వచించింది. పార్లమెంట్ చట్టం ద్వారా అధికారికంగా ప్రచురించిన జనగణన అని తెలిపింది. అంటే ఇప్పటివరకు అధికారికంగా అందుబాటులో ఉన్నవి 2011 జనాభా లెక్కలే. కాబట్టి ప్రభుత్వం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు పెంచనున్నదని స్పష్టమవుతున్నది. మరోవైపు 2026 తర్వాత జరగనున్న జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగాలని ఆర్టికల్ 82లోని మూడవ క్లాజు చెప్తున్నది. అయితే ఈ ఏప్రిల్ 1న కొత్తగా జనగణన ప్రారంభమైంది. ఈ లెక్కల వివరాలు వచ్చే వరకు కేంద్రం ఆగకుండా ఆగమేఘాలపై సీట్ల పెంపుపై ఎందుకు దృష్టి పెట్టిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. అది కూడా 15 ఏండ్ల క్రితం నాటి పాత లెక్కలను పరిగణనలోకి తీసుకోవడం అసంబద్ధంగా ఉన్నది. పాత గణాంకాలను డీలిమిటేషన్‌కు వర్తింపజేసే సమయానికి అవి మరింత పాతబడిపోతాయి. ముఖ్యంగా హిందీ బెల్ట్ రాష్ట్రాలు, ఐదు దక్షిణ రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, తమిళనాడు) మధ్య వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటుంది.

ప్రభుత్వం చెప్తున్న రెండో బిల్లు: నియోజవర్గాల పునర్విభజన బిల్లు. ఇది డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాల పునర్విభజన, రాష్ట్రాల శాసనసభల్లోని మొత్తం స్థానాల సంఖ్య సర్దుబాటు వంటి విషయాలు ఈ బిల్లులో పొందుపర్చి ఉన్నాయి. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం చేయాల్సిన ప్రక్రియ. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశాలేమీ ఉండవు. ఇక మూడో బిల్లు విషయానికి వస్తే ప్రధానంగా కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఇదే విధమైన నిబంధనలను వర్తింపజేస్తుంది. అయితే, డీలిమిటేషన్ కమిషన్ నిర్మాణం ఎలా ఉంటుంది? అందులోని సభ్యుల ఎంపిక ఎలా జరుగుతుంది? అనేవి అసలు ప్రశ్నలు. కేంద్రం ప్రతిపాదించిన బిల్లును పరిశీలిస్తే కమిషన్ నిర్మాణం మొత్తం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందనే విషయం స్పష్టమవుతున్నది. ఏ రాష్ట్రానికి ఎన్ని సీట్లు కేటాయించాలనేది డీలిమిటేషన్ కమిషన్ చేతుల్లోనే ఉంటుంది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిషన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌లు సభ్యులుగా ఉంటారని బిల్లులో పేర్కొన్నది. దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై, ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ తీరుతెన్నులపై అనేక సందేహాలు, విమర్శలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం చర్యలతో బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలిగే ప్రమాదమున్నదని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రం చెప్తున్న దాని ప్రకారం 20011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే ఎలాంటి ప్రభావం ఉంటుందో పరిశీలిద్దాం. నాటి లెక్కల ప్రకారం సీట్ల సంఖ్యను పెంచితే ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఉదాహరణకు ఆరు హిందీ బెల్ట్ రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గణాంకాలు చూసుకుంటే దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆ ఆరు రాష్ట్రాల్లో జనాభా వేగంగా పెరిగినట్టు స్పష్టమవుతున్నది. ప్రస్తుతం ఆ ఆరు రాష్ట్రాల్లో 195 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ డీలిమిటేషన్ కమిషన్ 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే, దేశంలో మొత్తం 800 సీట్లుగా ఖరారు చేస్తే ఆ ఆరు రాష్ట్రాలకే 328 సీట్ల కేటాయింపు జరుగుతుంది. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక, తమిళనాడులోని 129 స్థానాలు 168కి పెరుగుతాయి. అంటే విద్యా, వైద్య రంగాల్లో చైతన్యం, అభివృద్ధి కారణంగా జనాభా నియంత్రణను అద్భుతంగా అమలు చేసినరాష్ట్రాలకు కేవలం 39 సీట్లు మాత్రమే అదనంగా లభిస్తే, జనాభా నియంత్రణలో వెనుకబడిన రాష్ట్రాలు అదనంగా 133 స్థానాలను పొందుతాయి. సీట్ల సంఖ్యలో ఈ వ్యత్యాసం కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ఎలాంటి కీలక అంశంగా మారుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న చర్యల పట్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని, ఇదే తుది హెచ్చరిక అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తేల్చిచెప్పారు. కేంద్రం ప్రతిపాదనలు దక్షిణాదికి అన్యాయం చే సేలా, ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూర్చే లా ఉన్నాయని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా అన్నారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వ చర్యలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందని పలువురు నిపుణులు, దక్షిణాదికి చెందిన ప్రాంతీయ పార్టీల నేతలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును ఓటింగ్ ద్వారా ఆమోదించుకోవాలంటే మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు బిల్లులకు వ్యతిరేకంగా ఓటు వేస్తే బిల్లుల అమోదం అసాధ్యం. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కసరత్తును వేగవంతం చేస్తున్నామని చెప్పుకొనేందుకు ప్రభుత్వం హడావుడి ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది. ప్రభుత్వం చెప్తున్నట్టుగా 800కు పైగా స్థానాలు పెరిగితే ప్రపంచంలోనే అత్యధికంగా ఎన్నికయిన సభ్యులు గల చట్టసభగా లోక్‌సభ గుర్తింపు పొందుతుంది. కానీ మహిళా బిల్లు, డీలిమిటేషన్, జనగణనను కలిపి కసరత్తు చేయడం అసంబద్ధంగా ఉన్నది. కేంద్రం తీరు పార్లమెంటు, ప్రజాస్వామ్య అనిశ్చితికి దారితీసేలా కనిపిస్తున్నది. కేంద్రం వైఖరి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఈ ధోరణి చూస్తుంటే హంగరీ నియంత ఓర్బన్ తరహా నిర్వాకంలాగానే కనిపిస్తున్నది. ఇటీవలే ఆయనను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించిన సంగతి తెలిసిందే.

## మున్సిపల్ కార్మిక సంఘం నూతన కార్యవర్గానికి బిజెపి నాయకుల ఘన సన్మానం



మెట్‌పల్లి:మెట్‌పల్లి పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం నూతన కార్యవర్గ సభ్యులను గురువారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బిజెపి నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూదరి అరుణ, డాక్టర్ అనుప్ రావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో మరియు పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలనివారు ఆకాంక్షించగా, జిల్లాఅధ్యక్షులురాచకొండ యాదగిరి బాబుమాట్లాడుతూ కార్మికులహక్కుల పోరాటంలో బిజెపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోడ్ల రమేష్, ధర్మపురి స్వరూప, అరిసె వనజతో పాటు నాయకులు ధర్మపురి వేణుగోపాల్, బోడ్ల నాగేష్, అరిసెమురళి,లింగేశ్వర్, సదాశివ్, సత్యనారాయణ,రాకేష్, అనిల్,విజయ్, పార్టీకార్యకర్తలు మరియు కార్మిక సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్కు స్థలాలకు మహర్దశ..

ఘట్కేసర్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని కాచివానిసింగారం, దివ్యానగర్, పోచారంలో డాక్టర్స్ కాలనీలలోని పార్కు స్థలాలను సందర్శించి కాలనీ వాసులతో మాట్లాడారు. పార్కుల అభివృద్ధికి జీహెచ్ఎంసీ ప్రత్యేక నిధులు కేటాయించినట్లు జడ్పీ తెలిపారు. పార్కుల అభివృద్ధికి స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు అందరూ సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ రాజీవ్ రెడ్డి, డీఈ నరేష్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుమల దర్శనాల పేరుతో మోసాలు..

# భక్తులకు టీటీడీ కీలక హెచ్చరిక

**తిరుమల దర్శనాలు ఇప్పిస్తామని సోషల్ మీడియాలో మోసాలు**

**భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్**

**అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని భక్తులకు టీటీడీ సూచన**

**మోసగాళ్ల సమాచారం కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ జారీ**

**తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా**



తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు సాగిస్తున్న మోసాలపై టీటీడీ ఉక్కుపాదం మోపింది. భక్తులను మాయమాటలతో నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈక్రమంలోనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టీటీడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సోషల్ మీడియాలో "శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం" అనే ఐడీతో భక్తులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ విభాగం, పోలీసుల సమన్వయంతో అదుపులోకి తీసుకుంది. నిందితులను చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులుగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించింది. ఎవరైనా దర్శనాలు, గదులు ఇప్పిస్తామని సంప్రదిస్తే, వెంటనే టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 9866898630కు సమాచారం ఇవ్వాలని కోరింది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఢిల్లీ సీఎం: ఢిల్లీ సీఎం రేఖా గుప్తా స్వామివారి దర్శనం అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి సెంటర్ పనితీరును ఆమెకు వివరించారు. భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి, క్యూలైన్లను సమర్థవంతంగా నిర్వహించడానికి ఉపయోగిస్తున్న "ప్రెడిక్టివ్ అనలిటిక్స్" టెక్నాలజీ గురించి తెలిపారు. లడ్డూ ప్రసాదం తయారీ, రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, వసతి గదుల కేటాయింపు వంటి అన్ని విభాగాలను ఈ సెంటర్ ద్వారా ఎలా సమన్వయం చేస్తున్నారో వివరించారు. భక్తుల భద్రత, సౌకర్యాల కోసం టీటీడీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న తీరును ఢిల్లీ సీఎం రేఖా గుప్తా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## ఇంధన ధరలు తగ్గాలంటే కార్లు తక్కువగా వాడండి

# అమెరికన్లకు షెవ్రాన్ అధికారి సలహా

**- డబ్బు ఆదా చేసుకోవాలంటే ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలని వ్యాఖ్య**

**- హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలు**

**- జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్**

**- ఈ నెల 22తో ముగియనున్న అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం**



ఢిల్లీ,:అమెరికా-ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో గ్యాస్ ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రముఖ చమురు సంస్థ షెవ్రాన్ ఎగ్జిక్యూటివ్ ఆండీ వాల్ష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పెరిగిన ధరల నుంచి ఉపశమనం పొందాలంటే ప్రజలు తమ వాహనాలను తక్కువగా వాడాలని, ఇంధనాన్ని పొదుపు చేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. సీబీఎస్ న్యూస్‌తో మాట్లాడుతూ... "ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలి. ఇంధనాన్ని పొదుపు చేసేందుకు ప్రయత్నించాలి. నిజానికి మనం ఎప్పుడూ ఇలాగే చేయాలి. ఇంధనం ప్రజల జీవితాలకు అత్యవసరం. దానిని మనం పొదుపుగా వాడుకోవాలి" అని వాల్ష్ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ సముద్ర మార్గ చమురు, సహజవాయువు రవాణాలో దాదాపు 20 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని తన అధీనంలోకి తీసుకోవడంతో గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురుపై ఆధారపడిన అనేక దేశాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. దీని ప్రభావంతో అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ అంశంపై వాల్ష్ వివరిస్తూ... "ఇది అంతర్జాతీయ మార్కెట్ సమస్య. కేవలం అమెరికన్ల కోసం ధరలను తగ్గించడానికి తక్షణమే అద్భుత పరిష్కారాలేవీ లేవు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత కఠినంగా ఉంటుంది" అని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలమవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్ జలసంధిపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. "ప్రపంచంలోనే అత్యుత్తమమైన మా నౌకాదళం, హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే లేదా బయటకు వెళ్లే అన్ని నౌకలను తక్షణమే దిగ్బంధిస్తుంది" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ వైఖరి మారే వరకు ఈ దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 22తో ముగియనుంది.

# దువ్వాడ స్థానంలో వాణికే అవకాశం

విజయనగరం,: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేసింది. వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీ ఆయనను దూరం పెట్టింది. అయితే ఆయన తిరిగి వైసీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి వర్కౌట్ అయ్యేలా లేవు. ధర్మాన సోదరులతో పాటు దాదాపు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులంతా దువ్వాడ శ్రీనివాసుని వ్యతిరేకిస్తున్నారు. సామాజిక వర్గ కోణంలో చూపి తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేశారు దువ్వాడ. కానీ ఆ ప్రయత్నలేవి వర్కౌట్ కాలేదు. దీనికి తోడు దువ్వాడ శ్రీనివాస్ వాణి ఇప్పుడు వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా దువ్వాడ శ్రీనివాస్ దూకుడుకు ఆమె బ్రేక్ వేసినట్టు కనిపిస్తున్నారు. జిల్లా పార్టీ పెద్దల ప్రోత్సాహంతోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన దువ్వాడ శ్రీనివాస్ వైసీపీ పెద్దలపై రగిలిపోతున్నట్లు సమాచారం. దువ్వాడ వాణి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఒక విధంగా వాణి కుటుంబం వల్లే దువ్వాడ శ్రీనివాస్ కు ఆ పేరు వచ్చింది. టెక్కలి ఎంపీపీ తో పాటు జడ్పిటిసి గా కూడా ఉన్నారు వాణి. మొన్నటి ఎన్నికల్లో ఆమెకు ముందుగా టికెట్ ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరి నిమిషంలో దువ్వాడ శ్రీనివాస్ కు ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం దువ్వాడ కుటుంబంలో రేగిన వివాదం గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లోనే వాణి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. అయితే ఆ నిర్ణయం ఆలస్యంగా తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేశారు. అయితే తిరిగి పార్టీలోకి దువ్వాడ చేరుతానని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ధర్మాన సోదరులపై మాత్రం అనుచిత వ్యాఖ్యలు తగ్గించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ కు చెక్ చెప్పేందుకు దువ్వాడ వాణి రంగంలోకి దిగారు.దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన క్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు వాణికి అప్పగిస్తారని అంత ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా పేరాడ తిలక్ కు ఇచ్చారు. అయినా సరే దువ్వాడ వాణి జిల్లా వైసీపీ పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు. అయితే టెక్కలిలో కింజరాపు అచ్చెనాయుడుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారని.. దిష్టిబొమ్మను దహనం చేశారని పోలీసులు పేరాడ తిలక్ ను అరెస్టు చేశారు. ఆ సమయంలో వైసీపీ నేతలు టెక్కలిలో ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదుట వాణి బైఠాయించారు కూడా. టెక్కలి వైసీపీలో మరోసారి దువ్వాడ శ్రీనివాస్ కు ఛాన్స్ ఇవ్వకూడదని.. ఆయనను తిరిగి పార్టీలో చేర్చకూడదని.. టెక్కలిలో తిలక్ ను గెలిపిస్తే నామినేటెడ్ పోస్టు వాణికి ఇస్తామన్న ఆఫర్ తోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఆమె సైతం దువ్వాడ శ్రీనివాసును పొలిటికల్ గా క్లోజ్ చేయాలని గట్టి సంకల్పంతో ఉన్నట్లు సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

**బాధితులను పరామర్శించిన కలెక్టర్ సిరి**

కర్నూలు,ఏప్రిల్16 : కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. బొలెరో వాహనం డ్రైవరు నిద్ర మత్తులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు.

# వేతనాలు పెంచమంటే...!



రెక్కలు ముక్కలు చేసుకున్నా కనీస అవసరాలు కూడా తీరకపోవడంతో వేతనాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు విరుచుకుపడుతున్న తీరు దుర్మార్గం! నెలల తరబడి విజ్ఞప్తులు చేసినా, రాయబారాలు జరిపినా కనీస స్పందన లేకపోవడంతో కార్మికులకు ఆందోళనలకు దిగడం మినహా మరోమార్గం లేకుండా పోయింది. సోమవారం నాడు తొలుత రెండు మూడు యూనిట్ల వద్ద శాంతియుతంగా కార్మికుల ఆందోళన ప్రారంభమైంది. ఆ తరువాత ఒకటి, రెండు గంటల్లోనే 80కిపైగా ప్రదేశాలకు విస్తరించడం, 45 వేల మందికిపైగా భాగస్వాములు కావడం పారిశ్రామిక వాడల్లో పరిస్థితులు ఏ స్థాయికి దిగజారాయో, కార్మికులు ఎంతగా విసిగి పోయి ఉన్నారో చెప్పడానికి నిదర్శనం. శాంతియుతంగా సమస్యను పరిష్కరించాల్సిన బిజెపి ప్రభుత్వాలు దానికి భిన్నంగా వ్యవహరించి, భయభ్రాంతులను చేయడమే లక్ష్యంగా పోలీసులను ఉసిగొల్పాయి. అయినా, వెనక్కి తగ్గని కార్మికులు వేతనాల పెంపుతో పాటు, పని ప్రదేశంలో భద్రత, ముందస్తు నోటీసు లేకుండా తొలగింపు, పనిగంటల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మరింత ఉధృతంగా తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అణచివేత చర్యలకు దిగింది. 300 మందికి పైగా కార్మికుల ను, నేతలను అరెస్ట్ చేసింది. కార్మిక వాడలతో పాటు, సమీపంలోని గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున దాడులకు దిగింది. కార్మికులను కొట్ట డంతో పాటు, కనపడిన వారికి కనపడ్డట్టుగా ఎత్తుకుపోతున్నారంటూ వస్తున్న వార్తలు భయం కలిగిస్తున్నాయి. వారిని ఎక్కడకు తరలిస్తున్నారో కూడా చెప్పడం లేదంటూ కార్మిక కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. కార్మికులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని సైతం పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడానికి బాధ్యత వహించాల్సిన కార్మికశాఖ మంత్రి విదేశీ శక్తుల మద్దతుతో ఆందోళనలు జరుగుతున్నాయనడం, కార్మికులను ఉగ్రవాదులతో పోల్చడం సిగ్గుచేటు!

దేశ రాజధాని న్యూఢిల్లీకి అత్యంత సమీపంగా ఉండే నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగావ్‌లలోని నేషనల్ కాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)పారిశ్రామిక బెల్ట్ లోని వివిధ ఫ్యాక్టరీల కార్మికులు చట్టబద్ధ హక్కులు, కనీస జీవన ప్రమాణాల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో కనీస వేతనం అన్న భావన రద్దు అయ్యింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఫ్యాక్టరీల యజమానులు పెద్ద ఎత్తున శ్రమ దోపిడి ప్రారంభించారు. ఎన్‌సిఆర్ విస్తరించి ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానాల్లోని బిజెపి ప్రభుత్వాలు యాజమాన్యాల ప్రయోజనాలకే పెద్దపీట వేయడంతో కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. రోజుకి పది గంటలపైగా పని చేసినా 300 రూపాయల వేతనం లభించడం కూడా కష్టంగా మారింది. దీంతో పాటు లేబర్ కోడ్‌ల పుణ్యమా అని కాంట్రాక్టు వ్యవస్థ కార్మికుల పని భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది. ఎప్పుడు ఉంటుందో, ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో పనికోసం, వేతనాల కోసం యాజమాన్యాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి కార్మికులకు ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకున్న యాజమాన్యాలు పని ప్రదేశాల్లో భద్రతా చర్యలను దాదాపుగా విస్మరించాయి. పెద్ద ఎత్తున అమానవీయ చర్యలకు, శ్రమ దోపిడికి దిగాయి.

అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం సాగదు కదా! వేతనాలు పెంచాలని, చట్టబద్ధమైన ప్రయోజనాలు అమలు చేయాలని కార్మికులు కొంత కాలంగా ఆందోళనకు దిగారు. గత రెండున్నర మాసాలుగా ఈ నిరసనలు సాగుతున్నాయి. అప్పటి నుండి ఈ ఆందోళనలను అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. అప్పటి నుండి అరెస్ట్‌లు జరుగుతూనే ఉన్నాయి. ఢిల్లీలోని సిఐటియు నేతలను కొద్ది రోజులగా గృహ నిర్బంధంలో ఉంచారు. అయినా, ఎన్‌సిఆర్‌లో కార్మికుల తిరుగుబాటును ఆపలేకపోయారు. ఇప్పటికైనా పరిస్థితి తీవ్రతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. అన్ని రకాల అణచివేత, ప్రతీకార చర్యలను తక్షణమే ఆపివేయాలి. కార్మికులతోనూ, కార్మిక సంఘాలతోనూ చర్చించి వారి డిమాండ్లను పరిష్కరించాలి.

## పదవ రోజుకు చేరిన ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్ ల నిరసన




మందమర్రి టౌన్ ఏప్రిల్ 16 (తెలంగాణవాణి విలేకరి): సింగరేణి ప్రైవేట్ సెక్యూ రిటీ గార్డుల పోరాటం 10వ రోజుకు చేరగా కాసి పేట గని పై ఫ్ల కార్డులు పట్టుకొని గురువారం శాంతియుతంగా నిరసననుతెలియ జేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీని వాస్ మాట్లాడుతూ ప్రైవే టు సెక్యూరిటీ గార్డుల పోరాటం ఎస్సీకేఎస్ సిఐ టియు ఆధ్వర్యంలో 10వ రోజు కాసిపేట బాయ్ మీద నిరసన తెలియజే యడం జరిగిందని అన్నా రు. దీనికి టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ అశోక్, ఏ ఐటి యుసిఫిట్ సెక్రెటరీనాగ మల్లేష్ మద్దతు తెలిపారు.గత రెండు నెలలుగా ఉపాధి కోల్పో యి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ల విషయంలో మానవత దృక్పథంతో ఆలోచించి సమస్యను పరిష్కరించే లా ఏరియా జియం చర్యలు తీసుకోవాలని అన్నారు.అలాగే చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి స్పందించి ప్రైవేటుసెక్యూరిటీగార్డుల సమస్య ను ప్రత్యేక చొరవ తీసుకొని జియంతో చర్చించి న్యాయం జరిగే విధంగా ఏలాంటి ఆంక్షలు లేకుండా విధు ల్లోకి తీసుకునేలా చూడా లని తెలిపారు. లేని పక్షంలో తర్వాత జరగబోయేపరిణామాలకు అధికా రులు మంత్రివర్యు లే పూర్తి బాధ్యత వహించ వలసి వస్తుందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మహిళలతో పాటు మగవాళ్లకూ తప్పని వేధింపులు..

# టీసీఎస్ లో దారుణాలు




**- మతం మార్చుకోవాలని ఒత్తిడి.. వినకుంటే పనిభారం**
**- పిల్లలు కలగని ఓ యువ ఉద్యోగితో అసభ్యకరమైన మాటలు**
**- మీడియా ముందు వెల్లడించిన బాధితుడు**

ఢిల్లీ,: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు, మతమార్పిడి ప్రయత్నాలకు సంబంధించిన వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగు లోకి వస్తున్నాయి. నిందితులు తమ అధికారాన్ని ఉపయోగించుకుని మహిళా ఉద్యోగులను మాత్రమే కాదు, పురుష ఉద్యోగులను కూడా మానసికంగా హింసించారని, బలవంతపు మత మార్పిడులకు ఒత్తిడి చేశారని బయటపడింది. తాజాగా ఒక పురుష ఉద్యోగి తనకు ఎదురైన భయంకరమైన అనుభవాలను బయటపెట్టారు. తనతో బలవంతంగా 'స్కల్ క్యాప్' (టోపీ) ధరింపజేసి, నమాజ్ చేయించారని ఆయన ఆరోపించారు. అంతటితో ఆగకుండా, నిందితుల్లో ఒకరు తన వ్యక్తిగత జీవితంపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ 'పిల్లలు కావాలంటే నీ భార్యను నా దగ్గరకు పంపు' అని అన్నట్లు పేర్కొన్నారు. తన టీమ్ లీడర్లు తనతో బలవంతంగా నమాజ్ చేయించారని, కల్మా చదివించారని, స్కల్ క్యాప్ ధరింపజేశారని ఆ బాధితుడు ఓ మీడియా సంస్థతో పేర్కొన్నారు. వైద్య చికిత్స పొందుతు న్నప్పటికీ తన భార్యకు పిల్లలు కలగడంలేదన్న విషయంపై నిందితులు ఎగతాళి చేస్తూ, అత్యంత దారుణమైన మరియు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో తాను కంపెనీలో చేరగా.. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే వేధింపులు మొదలయ్యాయని ఆయన తెలిపారు. తన టీమ్ లీడర్ తౌసిఫ్ అక్తర్, సహోద్యోగి డానిష్ షేక్ తనను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. టీమ్ లీడర్ గా ఉన్న తౌసిఫ్.. తన మాట వినేలా చేయడానికి ఇతరుల పనిని కూడా తనపై వేసి, శారీరకంగా, మానసికంగా అలసిపోయేలా చేసేవాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఫిర్యాదులపై నాసిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే కొందరు కీలక వ్యక్తులను విచారించినట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనలపై టీసీఎస్ యాజమాన్యం కూడా స్పందించింది. ఆరోపణలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, అంతర్గత విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని ప్రకటించింది.

## రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్**

ఆదిలాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'రోడ్డు భద్రత అవగాహన' సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, సూచిక బోర్డులు, హెచ్చరిక లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కేవలం చట్టాలు సరిపోవని, ప్రజల్లో ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపు అత్యంత అవసరమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం మానుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు (రెవెన్యూ) కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, రెవెన్యూ, రవాణా, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు, రోడ్లు-భవనాల శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### పిఠాపురానికి 'సెలక్షన్ గ్రేడ్' హోదా..

# పవన్ చొరవతో కీలక నిర్ణయం

**- సెకండ్ గ్రేడ్ నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ అధికారికంగా ఉత్తర్వుల జారీ**
**- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో వేగంగా పూర్తయిన ప్రక్రియ**
**- హోదా పెంపుతో పెరగనున్న నిధులు.. మెరుగవనున్న మౌలిక వసతులు**
**- త్వరలో కమిషనర్‌గా గ్రూప్-1 స్థాయి అధికారి నియామకం**




పిఠాపురం : డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్‌కు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ హోదా పెంపుతో పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం కానుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపినట్లు తెలుస్తోంది. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్, ప్రత్యేక అధికారి పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. 2021 నుంచి 2025 వరకు మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాల రికార్డులను సమీక్షించిన అనంతరం, సెలక్షన్ గ్రేడ్‌కు అర్హత ఉందని నిర్ధారించి ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా రూ. 8 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్న మున్సిపాలిటీలకు సెలక్షన్ గ్రేడ్ హోదా కల్పిస్తారు. ఈ హోదా పెంపుతో పిఠాపురం అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ఇకపై గ్రూప్-1 స్థాయి అధికారి కమిషనర్‌గా బాధ్యతలు చేపడతారు. మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు భారీగా అందనున్నాయి. తద్వారా పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. 1957లో మున్సిపాలిటీగా ఏర్పడిన పిఠాపురం, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా దేవి శక్తిపీఠం, శ్రీపాద వల్లభుల ఆలయాలకు దేశవ్యాప్తంగా భక్తులు వస్తుంటారు. పెరిగిన జనాభా, భక్తుల రద్దీతో మున్సిపాలిటీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవల కాలంలో పిఠాపురం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే 'పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఏడీఏ)ని ఏర్పాటు చేసింది. అలాగే కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ. 37.25 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇప్పుడు మున్సిపాలిటీ హోదా పెంపుతో అభివృద్ధి మరింత ఊపందుకోనుంది.

# కార్పొరేట్ జీహాదీలో కొత్త కోణాలు

నాసిక్, : మహారాష్ట్రని కుదిపేసిన నాసిక్ బీపీవో లైంగిక వేధింపుల అంశంలో పోలీసులు చాలా పక్కాగా వ్యవహరించారు. దాదాపు 150మంది వరకూ పనిచేస్తున్న ఆ ఃఖాలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు రావడంతో నిజాన్ని నిర్ధారించుకోవడానికి పోలీసులు అండర్ కవర్ ఆపరేషన్ చేశారు. కొన్ని రోజులు అక్కడ పనిచేసి నిజాలు నిర్ధారించుకున్న తర్వాతే ఎఫ్ ఐఆర్ లు నమోదు చేశారు. మహరాష్ట్ర నాసిక్‌లోని మహిళా ఉ ద్యోగులపై వేధింపులు, ఉద్యోగ ప్రలోభాలు, మతపరమైన ఒత్తిళ్లు ఉ న్నాయని ఆరోపణలు రావడం సంచలనం రేకెత్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే తొమ్మది లు నమోదు కాగా ఏడుగురుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఎక్కువ మంది ఓ మతానికి చెందిన వారుండటం, వారు బలవంతపు మతమార్పిడికి ప్రయత్నించారన్న ఫిర్యాదు రావడంతో విషయం సున్నితంగా మారింది. రైట్ వింగ్ రాజకీయ పార్టీలు ఇది లవ్‌జిహాద్‌లాగా కార్పోరేట్ జిహాద్ అని అభివర్ణించాయి. బలవంతపు మతమార్పిడిలకు కార్పోరేట్ ఆఫీసులను కూడా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే ఈ వ్యవహారం ముందుగా బయటకు వచ్చినప్పుడు.. విషయం సెన్సిటివ్ కావడంతో పోలీసులు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ముందుగా విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతనే యాక్షన్‌లోకి దిగారు. అసలు ఈ విషయంలో ఎప్పుడు బయటకు వచ్చిందంటే..టీసీఎస్ అనుబంధ ఃఖాలో పనిచేసే ఓ 20 ఏళ్ల హిందూ అమ్మాయి.. అక్కడ చేరిన కొన్నిరోజులకు తన మతపరమైన ఆచార వ్యవహారాలను మార్చుకుంది. ఆహార్యం, తన మతపరమైన గుర్తింపును మార్చుకునేందుకు ప్రయత్నించడంతో ఆమె తల్లిదండ్రులు ఆమె ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేశారు. ఆఫీసులోనే ఏదో జరుగుతోందని ఈ ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ చాలా పేరున్న కంపెనీ.. ఆ సంస్థలో వ్యవహారం కావడం.. విషయం చాలా సున్నితమైంది కావడంతో పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించారు. అనుమానాన్ని నిర్ధారించుకునేందుకు టీసీఎస్ లో హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా కొంతమంది కానిస్టేబుళ్లు చేరారు. ఇందులో ఒకరిద్దరు మహిళా అధికారులు కూడా ఉన్నారని కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. దాదాపు 15 రోజులు అక్కడ నిఘా ఉంచి జరుగుతున్నది నిజమే అని నిర్ధారించుకు న్నారు. 2026 మార్చి 25న ఒక మహిళా ఉద్యోగి డెలాలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను 2022 నుంచి 2026 వరకూ సహచరుల చేత లైంగిక దోపిడీ, మతపరమైన వేధింపులు ఎదుర్కొన్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ముందుకు రావాలని కోరారు. దీంతో మరింత మరింత మంది బాధితులు బయటకు వచ్చారు కొద్ది రోజుల్లోనే కేసు పెద్దైంది. మొత్తం 9 ఎఫ్ ఐ ఆర్ లు నమోదయ్యాయి. 8మంది మహిళలు, ఓ పురుషుడు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులన్నీ లైంగిక వేధింపులు, అత్యాచారం, బలవంతపు సంబంధాలు, స్టాకింగ్, బెదిరింపులు, మతపరమైన ఒత్తిళ్లు, మార్పిడి ప్రయత్నాలు , మతంపై దూషణలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఒకే మతానికి చెందిన వారు కావడంతో ఇది 'కార్పోరేట్ జిహాద్'గా మారింది.ఏడుగురు అరెస్ట్ చేయగా.. అరెస్టైన వారంతా టీమ్ లీడర్లు, హెచ్ ఆర్ అధికారులు ఉన్నారు వారంతా ఒకేమతానికి చెందిన వారు. అరెస్టైన వారిలో అసిఫ్ అంసారీ, షఫీ షేక్, షారుక్ ఖురేషీ, రజా మెమన్, తౌసిఫ్ అట్టార్, డానిష్ షేక్ ఉన్నారు. వీరితో పాటు.. ఉద్యోగినులు ఫిర్యాదు ఇచ్చినా కూడా పట్టించుకోని మహిళా ఏజీఎం ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో విషయం మతపరంగా మారిపోయింది. బీజేపీ దీనిని పక్కా ప్రణాళికతో చేసిన కార్పోరేట్ స్కాండల్ అంటోంది. నిందితుల తరపు లాయర్లు మాత్రం దీనిని అనవసరంగా సన్సేషనల్ చేస్తున్నారని.. విషయాన్ని పెద్దది చేసి చూపిస్తున్నారని కామెంట్ చేస్తున్నారు. ఆఫీసుల్లో జరిగిన సంభాషణల్లో వచ్చిన అభిప్రాయ భేదాలు, విభిన్న ఆలోచనలు, భావజాలల మధ్య అంతరాలే తప్ప.. బలవంతంగా ఏం జరగలేదని లాయర్లు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని టీసీఎస్ చాలా సీరియస్‌గా తీసుకుంది. అరెస్టైన ఉ ద్యోగులందరినీ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారాన్ని తాము చాలా తీవ్రంగా తీసుకుంటున్నామని ప్రకటించింది. పని ప్రదేశంలో బలవంతాలను నిరోధించే జీరో టాలరెన్స్ కు తాము కట్టుబడి ఉ న్నామని ఇలాంటి విషయాలను ఏమాత్రం ఉపేక్షించని చెప్పింది. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ కూడా ఇది తీవ్రంగా విచారించదగ్గ విషయమని..దీనిపై సంస్థ ఆర్తి సుబ్రమణియన్‌తో విచారణ జరిపిస్తున్నామని ప్రకటించారు.



# లక్ష్యాలను 100% సాధించడంలో సెర్ప్ సిబ్బంది కృషి చేయాలి

**స్త్రీనిధి రుణాల పంపిణీ రికవరీలో జిల్లా ముందుండాలి**
**వీ-హబ్ శిక్షణలతో మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి**
**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి: ఏప్రిల్,16(తెలంగాణ వాణి ప్రతినిధి ): స్వశక్తి సంఘాల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను 100% సాధించడానికి సెర్ప్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘాల కవరేజ్‌లో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లాను ముందంజలో ఉంచేలా అందరూ కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రుణాల లక్ష్యాలను పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలనిజిల్లాలో మహిళ శిక్షణల సంస్థ విహబ్ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విహబ్ శిక్షణల కోసం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మహిళలను సమీకరించి శిక్షణలకు హాజరయ్యేలా సెర్ప్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సిబ్బంది అందరూ సమన్వయంతో కృషి చేసి అన్ని అంశాలలో జిల్లాను అగ్రభాగంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే. కాలిందిని, అదనపు డి. ఆర్. డి. ఓ బి. రవీందర్, డిపిఎంలు వెంకటరమణ, సంజీవ్, స్త్రీనిధి ఆర్ఎం దుర్గాప్రసాద్, ఏపీఎంలు, స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ కారణాలవల్లే ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన

# "సింగరేణి"



### 53వేల కోట్ల బకాయిలు రాబట్టడంలో గుర్తింపు సంఘాలు విఫలం
### ఏఐటీయూసీ, ఐఎన్టియుసి సంఘాల స్వార్థ విధానాలతో పరిష్కారానికి నోచుకోని పెండింగ్ సమస్యలు
### 12వ వేతన ఒప్పందం అమలకై దశల వారి ఆందోళనలకు సిద్ధం కావాలి
### ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్

కొత్తగూడెం (తెలంగాణ వాణి): గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని బిఎంఎస్ అనుబంధ ఏబికేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి. మాధవ నాయక్ ఆరోపించారు. గురువారం స్థానిక బిఎంఎస్ భవన్ లో యూనియన్ ఉపాధ్యక్షులు బి. రాంసింగ్ అధ్యక్షతన జరిగిన సింగరేణి కోల్ మెన్స్ కార్మిక సంఘ్ కార్పొరేట్ ఏరియా, కొత్తగూడెం ఏరియాలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలు, నాయకులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధిక రాజకీయ జోక్యంతో సంస్థను ఆర్థికంగా బలహీనపరుస్తున్నాయని విమర్శించారు. డిసెంబర్ 2025 నాటికే సింగరేణికి రావలసిన సుమారు రూ.50,000 కోట్ల బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుండి వసూలు చేయడంలో గుర్తింపు సంఘాలు అయిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ విఫలమయ్యాయని విమర్శించారు. దీనివల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా కొనసాగిన ఏఐటీయూసీ తమ కాలంలో స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించినప్పటికీ, కార్మిక సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంతేగాక కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘంగా కాలపరిమితి ముగిసిన తర్వాత ఆందోళనలు చేపట్టడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఏ ఐ టి యు సి, ఐ ఎన్ టి యు సి సంఘాల నాయకులు ప్రకటించిన కార్మిక వర్గానికి సొంతింటి పథకం, పెర్క్‌పై ఇన్‌కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, చీఫ్ ఫార్మసిస్ట్, చీఫ్ రేడియాలజీ, చీఫ్ ల్యాబ్ టెక్నీషియన్ వంటి క్యాడర్ స్కీమ్‌ల అమలులో విఫలమయ్యారని విమర్శించారు. నర్సులకు ఆఫీసర్ గ్రేడ్ ఇప్పిస్తామని ప్రకటించి, ఆచరణలో ఎందుకు అమలు చేయకపోయారంటు ప్రశ్నించారు. మారుపేర్ల సమస్యతో వేలాది మంది కార్మికులు రోడ్లపై ఆందోళనలు చేస్తున్నప్పటికీ, వాటి పరిష్కారంలో కూడా వైఫల్యం చెందినట్లు స్పష్టమైందన్నారని వ్యాఖ్యానించారు.

అదేవిధంగా కొత్త గనుల కేటాయింపులో రాజకీయ కారణాలతో సింగరేణికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో గనులు రాకుండా అడ్డుకున్న కార్మిక సంఘాలే ఇప్పుడు వేలం ద్వారా గనులు పొందాలని చెప్పడం దూరంగా ఉందని ఆరోపించారు. ఈ పరిస్థితులకు సంబంధిత సంఘాలు బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ( బి ఎం ఎస్) రాజకీయాలకు అతీతంగా సింగరేణి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని మరోసారి స్పష్టం చేశారు. బొగ్గు బ్లాకుల వేలం ద్వారా కొత్త గనులు సాధించి సంస్థ మనుగడ కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న బిఎంఎస్‌ను కార్మికులు ఆదరించి ప్రత్యేక సంఘంగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన సవరణ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ ఏడాది జూలై 1వ తేదీ నుండి అమలులోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని బిఎంఎస్ నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాక కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి వెంటనే జేబీసీసీఐ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏబికేఎంఎస్ ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు. 12వ వేతన ఒప్పందానికి సంబంధించిన ఆందోళనల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్, యూనియన్ నాయకులు ఎం. శ్రీనివాస్, కాసర్ల మోహన్, ఉదయ్, భీమా, బాలకృష్ణ, అశోక్, ఠాగూర్, నరేష్, చంద్రశేఖర్, రవి, వడ్డీ కాసులు, శైలేందర్, వీర కుమార్, రాజేష్, ఆత్రేయ, సుధాకర్, సంగం చందర్, ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల తదితరులు, కొత్తగూడెం కార్పొరేట్ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి- ప్రిన్సిపల్



ధర్మారం: ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి): మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో ఘనంగా ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ప్రిన్సిపల్ అరుణ. ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపల్ అరుణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో స్థిరపడుతారని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. మల్లాపూర్ గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ మొత్తం శిక్షణ కార్యక్రమాన్ని ఒకేషనల్ ట్రైనర్స్ సుప్రజ, పుష్పలత విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నరు.

## అధిక ఉష్ణోగ్రతల నుండి జాగ్రత్తలు వహిస్తూ విధులు నిర్వర్తించాలి

### జిల్లా ఎస్పీ, మహేష్ బి.గీతే



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న అధికారులకు,సిబ్బందికి అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వడగలుల నుండి రక్షణకు కూలింగ్ గ్లాసెస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్ర ఎండల సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ మరియు వివిధ బందోబస్తు విధులలో పాల్గొనే వారు నీరు, గ్లూకోజ్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎండల ప్రభావం తగ్గించే విధంగా తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని,తగిన జాగ్రత్తలతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమలపై, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై, మైనర్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలనతోనే ప్రగతి సాధ్యం..

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మన జిల్లానే టాప్
### జిల్లాలో పకడ్బందీగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' అమలు
### కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ప్రజా పాలనతోనే గ్రామాల ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్వహించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో గురువారం మండల సభ నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు, రైతులు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. అరైవ్ అలైవ్ కింద ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేశారు. ఇల్లంతకుంట మండలంలో ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారుల జాబితాను ఎంపీడీఓ శశికళ వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లా మొత్తంలో నూతన రేషన్ కార్డులు 23,131 మంజూరు చేశామని, రూ. 500లకే ఇప్పటిదాకా 3,91,247 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటిదాకా 1,648 ఇండ్లు పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన జాబితాలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. అలాగే 1,25,855 మందికి రైతు భరోసా అందిందని, 46,492 మందికి రుణమాఫీ అయిందని అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి వెళ్లింది మొదలు ఇంటికి వచ్చే వరకూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికే జిల్లాలో పారిశుధ్య పనులు చేయించామని,వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని అన్నారు. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాకు వచ్చిన మొబైల్ ఎక్స్ రే యంత్రం ప్రారంభించామని, 42 గ్రామాల్లో పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలి : నో హెల్మెట్ నో ఎంట్రీ కార్యక్రమాన్ని గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అందరి రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అవుతుందని తెలిపారు. మండలానికి కేటాయించిన వీఓఏ భవనాలు జూన్ 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు త్వరలో బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మద్యాహ్న భోజనం, దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా అమలు చేయనున్నదని అన్నారు . రైతులు వరితో పాటుగా ఆయిల్ పామ్ సాగు చేయాలని, దీంతో మంచి దిగుబడి, మద్దతు ధర వస్తున్నద్నని, రైతులకు సబ్సిడీ పై మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తారని అన్నారు.

పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలిపే స్టాళ్లు :వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో ఆయిల్ పామ్, పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్, నానో యూరియా విశేషాలు వెల్లడిస్తూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ పోషక పదార్థాలతో ఉపయోగాలు తెలియజేస్తూ మహిళా సంఘాల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వస్త్రాలు, ఆహార పదార్థాల స్టాళ్లను పరిశీలించి పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసిల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి పిలిచి కొట్టిన స్నేహితులు..

### విశాఖ యువతి మృతి కేసులో కీలక విషయాలు

విశాఖ: విశాఖలో యువతి శాంతికుమారి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పార్టీ పేరుతో పిలిచి స్నేహితులు కొట్టడంతోనే ఆమె మనస్థాపం చెందారు. పార్టీ అయిన తర్వాత శాంతి కుమారితో ముగ్గురు యువకులు, ఇద్దరు అమ్మాయిలు గొడవ పడినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. పార్టీలో సాయి కిరణ్, లక్ష్మి సౌజన్య, జశ్వంత్ సహా మరో ఇద్దరు ఉన్నట్టు గుర్తించారు. మిత్రులు కొట్టారనే బాధతో శాంతికుమారి ఆత్మహత్య చేసుకుందని విశాఖ ఏసీపీ నరసింహమూర్తి తెలిపారు. మిత్రులతో కలిసి పుట్టినరోజు పార్టీకి శాంతికుమారి హాజరయ్యారని, ఆ తర్వాత మిత్రుల మధ్య గొడవ జరిగిందని చెప్పారు. ఈ క్రమంలో శాంతికుమారిపై మిగతా స్నేహితులు దాడి చేశారని, ఈ బాధతోనే శాంతికుమారి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ కేసులో మొత్తం ఐదుగురు యువకులు, ఒక యువతిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని ఏసీపీ నరసింహమూర్తి స్పష్టం చేశారు.

## కీటక జనిత వ్యాధులపై సీజనల్ వ్యాధులపై..

# ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించాలి

### కీటక జనిత వ్యాధులపై డిఎంహెచ్ఓ సమీక్ష



నిజామాబాద్ ఏప్రిల్ 16: (తెలంగాణ వాణి ప్రతినిధి):కీటక జనిత వ్యాధులపై సీజనల్ వ్యాధులపై ప్రజలకువిస్తృతంగా అవగాహన కలిగించాలని డిఎంహెచ్ఓ రాజశ్రీ స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16వ తేదీ నుండి మే 15వ తేదీ వరకు కీటక జనిత వ్యాధుల నియంత్రణ, వడదెబ్బ నియంత్రణ మరియు టీవీ ముక్తభారత్ పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారినిజిల్లా డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు . ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖలోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం కీటక జనిత వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం జరిగినట్లు డిఎంఓ డాక్టర్ వినయ్ కుమార్ తెలియజేశారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డి ఎం హెచ్ ఓ డాక్టర్ బి రాజశ్రీ పాల్గొన్నారు .ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ కీటక జనీత వ్యాధుల నియంత్రణ విభాగంలో ఉన్నటువంటి అన్ని కాంపోనెంట్స్ ను మలేరియా ,ఫైలేరియా, డెంగ్యూ, చికున్గున్య మెదడువాపు వంటి అన్ని రకాల వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. కీటక జనీత వ్యాధుల నియంత్రణలో భాగంగా పనిచేసే సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షక అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు వారి వారి విధుల్లో నాణ్యమైన సేవలు అందిస్తూ యాక్టివ్ మరియు పాసివ్ ఆర్ డి టి ని పెంచాలన్నారు. అదేవిధంగా ఐ హెచ్ ఐ పి మలేరియాపోర్టల్ లో నిరంతరం ఎంట్రీ చేయాలని అన్నారు. ఏం 4 అబ్స్ట్రాక్ట్ రిపోర్టును ఆన్లైన్లో ఎంట్రీ చేయాలని తెలియజేశారు. ఫ్రైడే డ్రై డేను పకడ్బందీగా నిర్వహిస్తూ ముందస్తు ప్రణాళికను మరియు వారం వారం రిపోర్ట్స్ను సమర్పించాలని తెలియజేశారు. పర్యవేక్షక సిబ్బంది ఎఫెక్టివ్ మానిటరిం గ్ చేస్తూ వారి వారి ఏరియాలో ప్రజలకు కీటక జనీత వ్యాధులపై ,సీజనల్ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా పాత ఫైలేరియా వ్యాధిగ్రస్తుల జాబితాను సవరిస్తూ చనిపోయిన వారిని డిలీట్ చేసి సవరించిన జాబితాను డిఎంఓ కి మరియు డిఎంహెచ్ఓ కి సమర్పించాలని అన్నారు. ఈ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే 30 రోజుల కార్యక్రమానికి సంబంధించి ప్రతిరోజు రిపోర్టు సమర్పించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిఎంఓ డాక్టర్ వినయ్ కుమార్,ఏ ఎం ఓ షేక్ సలీం, సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షక అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కలిసి కట్టుగా పని చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి బ్యూరో (తెలంగాణ వాణి) ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఎంబీ గార్డెన్స్ లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతు తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన పేరిట పాలన కొనసాగుతుందని, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పింఛన్లు, గృహ జ్యోతి, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి పేరిట వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుండి సూచనలు స్వీకరించి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్న కలెక్టర్, తీవ్రవాద దాడులు లేదా ఘోర రోగాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగా ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రమాదాల నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిం చేందుకు ప్రభుత్వం "ఏరైవ్-ఏలైవ్" కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ, ఓవర్ స్పీడింగ్ తగ్గించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వంటి ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌లోపు బాధితు లను ఆసుపత్రికి తరలిస్తే రహవీర్ పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం అందిస్తామని, అలాగే బాధితులకు సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్టియర్‌లో సత్తా చాటిన కార్తీకదీపం ఫేమ్ కృతిక



**తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో 470కి 459 మార్కులు సాధన**

**సోషల్ మీడియాలో మార్కుల మెమోను పంచుకున్న నటి**

**నటనతో పాటు చదువులోనూ రాణించడంపై వెల్లువెత్తిన ప్రశంసలు**

'కార్తీకదీపం' సీరియల్‌తో తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటికీ పరిచయమైన 'శౌర్య' అలియాస్ బేబీ కృతిక (సహృద) చదువులోనూ తన సత్తా చాటింది. ఇటీవల విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆమె అద్భుతమైన మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. నటనలో రాణిస్తూనే, చదువులోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే, తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహించిన మొదటి సంవత్సరంపరీక్షల్లో కృతికఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకు గానూ 459 మార్కులు సాధించింది. తన మార్కుల మెమోను ఆమె సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో ఈ విషయం వైరల్ అయింది. 'కార్తీకదీపం' సీరియల్‌లో 'వంటలక్క', 'డాక్టర్ బాబు'ల కూతురిగా, 'రౌడీ'గా తన నటనతో కృతిక ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకపోవడంపై నెటిజన్లు, అభిమానులు ఆమెను అభినందిస్తున్నారు. కృతిక గతంలో 'సరిలేరు నీకెవ్వరు', 'రాగల 24 గంటల్లో' వంటి చిత్రాల్లోనూ బాలనటిగా నటించింది. ప్రస్తుతం ఆమె ఇంటర్ రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టనుంది.

# ధనుష్ మూవీలోకి సారా!



సినీ వైకుంఠపాళిలో ఎవరిని ఎప్పుడు ఏ పాము కాటేస్తుందో... ఏ నిచ్చెన ఎవరిని పైకి తీసుకెళుతుందో ఊహించడం కష్టం. కెరీర్ హాయిగా, జాలీగా సాగిపోతోందని అనుకునేంతలో కొన్ని అవకాశాలు చేజారిపోతుంటాయి. నిస్తేజంగా ఉన్న కొందరిని ఊహించని కొన్ని విజయాలు... హఠాత్తునగా నిచ్చెనలు ఎక్కించేస్తుంటాయి. ప్రస్తుతం రుక్మిణీ వసంత్, సారా అర్జున్ విషయంలో అదే జరుగుతోంది. 'కాంతార 2' సినిమాతో గొప్ప విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది రుక్మిణీ వసంత్. ఇప్పుడు ఆమె కెరీర్ గ్రాఫ్ బాగుంది. ఎన్టీఆర్, నీల్ మూవీలోనూ రుక్మిణీ వసంత్ నాయికగా చేస్తోంది. అయితే... ఆ క్రేజీ ప్రాజెక్టే... ఇప్పుడు ఆమె పాలిట శాపంగా మారిపోయింది. పలుమార్లు ఈ సినిమా షెడ్యూల్స్ పోస్ట్ పోన్ అయ్యాయి. దాంతో ఆర్టిస్టుల డేట్స్‌ను సెట్ చేసుకోవడం మేకర్స్‌కు పెద్ద కష్టంగా మారిపోయింది. ఇలాంటి సమయంలో ఓ కీలకమైన పాత్రను రుక్మిణీ వసంత్ చేజార్చుకోవాల్సి వచ్చింది. ప్రముఖ తమిళ స్టార్ హీరో ధనుష్ ప్రస్తుతం 'కర' మూవీ చేస్తున్నాడు. ఇది ఏప్రిల్ 30న విడుదల కాబోతోంది. అలానే దీనితో పాటు తమిళరాసన్ పచ్చముత్తు దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇందులో రుక్మిణీ వసంత్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారు. కానీ ఇప్పుడు ఆమె డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో... ఆ స్థానంలోకి సారా అర్జున్ వస్తున్నట్టు తెలుస్తోంది. నిజానికి సారా అర్జున్ తమిళ ప్రేక్షకులకు సుపరిచితమే. బాలనటిగా ఆమె పలు తమిళ చిత్రాలలో నటించి, మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలానే యవ్వన ప్రాయంలోకి అడుగు పెడుతున్న తరుణంలో మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లోనూ నటించింది. అయితే... 'ధురంధర్' మూవీతో సారా అర్జున్ రేంజ్ అమాంతంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా 'ధురంధర్' ఫ్రాంచైజ్ చిత్రాలు రెండు కలిసి మూడువేల కోట్ల గ్రాస్‌ను సాధించడం చిన్న విషయం కాదు. ఆ సినిమాలలో నటించిన సారా... ఇప్పుడు ధనుష్ సరసన నటించడం అంటే... ఖచ్చితంగా ఆ ప్రాజెక్ట్ రేంజ్ పెరుగుతుంది. అయితే... దీనికి సంబంధించి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'





పవర్ స్టార్ పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో 'గబ్బర్ సింగ్' తర్వాత భారీ అంచనాలతో వచ్చిన చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటించగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో మెరిసింది. కోలీవుడ్ నటుడు పార్థీబన్ ప్రతినాయకుడిగా కనిపించారు. ఉగాది కానుకగా మార్చి 19న విడుదలైన ఈ చిత్రం ప్రారంభంలో మంచి హైప్ క్రియేట్ చేసుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మాత్రం యావరేజ్ టాక్‌తో సరిపెట్టుకుంది. పవన్ కల్యాణ్ స్టైల్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. అలాగే హరీశ్ శంకర్ మార్క్ డైలాగులు, హీరోయిన్ల గ్లామర్ కూడా ప్రేక్షకులను మెప్పించాయి. అయితే కథ, కంటెంట్ పరంగా సినిమా కొంత బలహీనంగా అనిపించిందని విమర్శలు వచ్చాయి. ఇదే సమయంలో పోటీగా వచ్చిన 'ధురంధర్ 2' సినిమా కూడా 'ఉస్తాద్ భగత్ సింగ్' కలెక్షన్లపై ప్రభావం చూపింది. దీంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మోస్తరు వసూళ్లతోనే ముగిసింది. అయినప్పటికీ పవన్ అభిమానుల్లో మాత్రం సినిమాకు మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకుని, ఏప్రిల్ 15 అర్ధరాత్రి నుంచే ప్రసారం ప్రారంభించింది. సంగీతం విషయానికి వస్తే, ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ పాటలు అందించగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ఎస్.ఎస్. థమన్ అందించారు. ముఖ్యంగా పవన్ కల్యాణ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'తొలిప్రేమ'లోని 'ఈ మనసే' పాటను రీమిక్స్ చేయడం విశేషం. ఈ సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. థియేటర్లలో యావరేజ్‌గా నిలిచిన 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పుడు ఓటీటీలో ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, సాధారణ ప్రేక్షకుల నుంచి కూడా ఈ సినిమాకు ఎలాంటి స్పందన వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# ఏడేళ్ల తర్వాత... మళ్లీ వస్తున్న 'మడోన్నా'



పాప్ సంగీత ప్రపంచానికి రాణిగా పేరుగాంచిన మడోన్నా.. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ సంగీత ప్రియులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. 67 ఏళ్ల ఈ సింగర్, తన 15వ స్టూడియో ఆల్బమ్‌కు సంబంధించిన వివరాలను మరో రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. 2019లో వచ్చిన 'మేడమ్ ఎక్స్' తర్వాత మడోన్నా నుంచి వస్తున్న ఆల్బమ్ ఇదే కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ఆల్బమ్‌ను మడోన్నా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. 2023లో సెప్సిస్‌తో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆ తర్వాత ఏడాది తన సోదరుడు క్రిస్టోఫర్‌ను కోల్పోయారు. ఈ అనుభవాలన్నీ ఆమె కొత్త ఆల్బమ్‌లో ప్రతిబింబిస్తాయని తెలుస్తోంది. 2005లో తనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన 'కన్ఫెషన్స్ ఆన్ ఏ డ్యాన్స్ ఫ్లోర్' ఆల్బమ్ ప్రొడ్యూసర్ స్టువర్ట్ ప్రైస్‌తో మడోన్నా మళ్లీ పనిచేస్తున్నారు. ఇది ఆల్బమ్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. మరోవైపు, ఈ ఆల్బమ్‌లో పాప్ స్టార్ బ్రిట్నీ స్పియర్స్‌తో కలిసి పనిచేసేందుకు మడోన్నా ప్రయత్నిస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుమారు 23 ఏళ్ల క్రితం 'మీ ఎగైనెస్ట్ ది మ్యూజిక్' పాటతో వీరిద్దరూ సంచలనం సృష్టించారు. బ్రిట్నీ ఒక అద్భుతమైన కళాకారిణి అని, ఆమెతో కలిసి పనిచేయడానికి మడోన్నా ఆసక్తిగా ఉన్నారని బ్రిట్నీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## బుల్లితెర రాములమ్మ క్రేజ్..

# ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా?





ప్రస్తుతం బుల్లితెరపై టాప్ యాంకర్ ఎవరంటే సుమ కనకాల పేరు చెప్పవచ్చు. అయితే ఆ తర్వాతి స్థానం బుల్లితెర రాములమ్మ శ్రీముఖినే అని చెప్పడంలో ఎలాంటి అతి శయోక్తి లేదు. ప్రస్తుతం చేతి నిండా టీవీ షోస్, రియాలిటీ షోస్ బిజీ బిజీగా ఉంటోంది అందాల తార. బుల్లితెర రాములమ్మ క్రేజ్.. ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా? నెలకు అన్ని లక్షల ఆదాయమా? ఈటీవీ ప్రోగ్రాం పటాస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది శ్రీముఖి. అంతకు ముందు జులాయి, నేను శైలజ వంటి సినిమాల్లో హీరో, హీరోయిన్లకు అక్కగా, చెల్లిగా నటించిన ఈ ముద్దుగుమ్మ బుల్లితెర ప్రోగ్రామ్స్ తోనే బాగా పాపులర్ అయ్యింది. ఓ వైపు గ్లామర్ తో ఆకట్టుకుంటూనే మరోవైపు సందర్భానికి తగ్గట్టుగా గలగలామాట్లాడడం, కామెడీపంచులు వేయడం ఈ ముద్దుగుమ్మ స్పెషల్ ట్యాలెంట్. అందుకే బిగ్ బాస్ వంటి రియాలిటీ షోలోనూ ఈ అందాల తార సత్తా చాటింది. రన్నరప్ గా నిలిచి తన క్రేజ్‌ను అమాంతం పెంచుకుంది. బిగ్ బాస్‌నుంచి బయటకు వచ్చిన తర్వాత టెలివిజన్ ప్రోగ్రామ్స్ మాత్రమే కాకుండా, సినిమా ఆడియో ఫంక్షన్లు, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ప్రైవేట్ ఓపెనింగ్స్ తో బాగా బిజీ బిజీగా మారిపోయింది శ్రీముఖి. అదే సమయంలో క్రేజీ అంకుల్స్, మ్యాస్ట్రో, భోళాశంకర్ తదితర సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. మొత్తానికి ఇప్పుడు బుల్లితెరపైనా, అప్పుడప్పుడు వెండితెరపైనా మెరుస్తూ మస్త్ బిజీగా ఉంటోంది అందాల తార. ఇదే క్రమంలో తన క్రేజ్, పాపులారిటీకి తగ్గట్టుగానే రెమ్యునరేషన్‌ను తీసుకుంటోంది. ప్రస్తుతం ఒక్క షో, ఈవెంట్ కోసం శ్రీముఖి దాదాపు రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా ఫంక్షన్ హోస్ట్ చేయాలంటేఆమె కనీసం రూ. 1.5లక్షల నుండి రూ. 2.5 లక్షల మధ్య పారితోషికం తీసుకుంటుందని సమాచారం. ప్రస్తుతం ఈటీవీ, స్టార్ మా వంటి ఛానెళ్లలోని పలు ప్రోగ్రామ్స్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తోంది శ్రీముఖి. అలాగే నెలకు కనీసం 3నుంచి 4 సినిమా ఈవెంట్లను కూడా హోస్ట్ చేస్తోంది. ఈ లెక్కన శ్రీముఖినెలవారీ ఆదాయం సుమారు రూ. 20 లక్షల నుండి రూ. 30 లక్షల వరకుఉంటుం దని అంచనా. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్, పాపులారిటీ దృష్ట్యా నిర్మాతలు కూడా ఆమె అడిగింది ఇచ్చేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు.

### 'జననాయగన్' లీక్.. అసలు దొంగ దొరికేశాడు..

'జననాయగన్' మూవీ లీక్ కేసును సైబర్ క్రైమ్ వింగ్ ఛేదించింది. ఈ కేసులో కీలక నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కొన్ని రోజులుగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటించిన 'జననాయగన్' మూవీపై ఎలాంటి వార్తలు వైరల్ అవుతున్నాయో తెలియంది కాదు. తమిళనాట ఎన్నికలు జరుగుతున్న సమయంలో, ఈ సినిమా లీక్ అవడంపై సర్వత్రా ఆసక్తి, అదే టైమ్‌లో రాజకీయ పార్టీలపై రకరకాలుగా అనుమానాలు మొదలయ్యాయి. ప్రస్తుతం అధికార పార్టీనే ఆ పని చేసిందని కొందరు, లేదు.. కావాలనే చిత్రయూనిట్ ఇలా చేసిందని మరికొందరు.. ఇలా ఏదో విధంగా వార్తలైతే వినబడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ వింగ్, అసలు నిందితులును పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించి, కేసును ఓ కొలిక్కి తీసుకొచ్చారు. ఈ సినిమా ఆన్‌లైన్‌లో లీక్ అయిన ఘటనపై ఏప్రిల్ 11న నమోదైన క్రైమ్ నంబర్ 47/2026 కేసులో స్టేట్ సైబర్ క్రైమ్ వింగ్ తాజా అప్‌డేట్‌ను విడుదల చేసింది. 'జననాయగన్' పైరసీ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసి, షేర్ చేసిన ఆరుగురిని ఇప్పటికే అరెస్ట్ చేయగా, ఇప్పుడు ఈ కేసులో ప్రధానమైన మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సాంకేతిక విశ్లేషణ, డిజిటల్ సాక్ష్యాధారాల ఆధారంగా.. 'జననాయగన్' సినిమా డేటాను దొంగిలించి, పైరసీ కాపీని వ్యాప్తి చేసినందుకు గాను సైబర్ క్రైమ్ వింగ్ ఏప్రిల్ 15న మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మరో సినిమాకు ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. 'జననాయగన్' సినిమా ఎడిటింగ్ స్టూడియోలో అతనికి అనుమతి లేనప్పటికీ, అనధికారికంగా సినిమా రీల్స్‌ను యాక్సెస్ చేసి డేటాను దొంగిలించాడు. ఆ దొంగిలించిన డేటాను సినిమాగా మార్చి, తన సహ నిందితులకు షేర్ చేశాడు. దీంతో ఆ పైరసీ కాపీలు ఆన్‌లైన్‌లో విపరీతంగా వ్యాప్తి చెందాయి. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను కోర్టు ముందు హాజరుపరిచి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లుగా సైబర్ క్రైమ్ వింగ్ తాజా అప్‌డేట్‌లో పేర్కొంది.



## టైమ్ 100 జాబితాలో ముగ్గురు

# భారతీయులు

## ప్రపంచంపై పెరుగుతున్న భారత ప్రభావం

- ఏఐ రంగంలో కృషికి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు గుర్తింపు
- నటనతో మెప్పించిన రణ్‌బీర్ కపూర్‌కు 'ఆర్టిస్ట్' విభాగంలో చోటు
- ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నాకు పాకశాస్త్రం, సేవకు గౌరవం
- జాబితాలో డొనాల్డ్ ట్రంప్, జీ జిన్‌పింగ్ వంటి ప్రపంచ నేతలు

ఢిల్లీ,: ప్రతిష్ఠాత్మక టైమ్ మ్యాగజైన్ ఏటా ప్రకటించే 'ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావశీలుర జాబితా'లో ఈ ఏడాది ముగ్గురు భారతీయులు చోటు దక్కించుకున్నారు. టెక్నాలజీ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన చెఫ్ వికాస్ ఖన్నా 2026 సంవత్సరానికి గానూ ఈ అరుదైన గౌరవాన్ని పొందారు. ఆవిష్కరణలు, సృజనాత్మకత, నాయకత్వ పటిమ, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేస్తూ ప్రపంచ గమనాన్ని ప్రభావితం చేస్తున్న వ్యక్తులను ఈ జాబితాలో చేర్చారు.

టెక్ రంగంలో సుందర్ పిచాయ్ ముద్ర: 'టైటాన్స్' కేటగిరీలో స్థానం పొందిన సుందర్ పిచాయ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ఆయన అందిస్తున్న నాయకత్వానికి గుర్తింపు పొందారు. గూగుల్ సెర్చ్, ఆండ్రాయిడ్, క్రోమ్ వంటి ఉత్పత్తుల్లో ఏఐ టూల్స్‌ను విజయవంతంగా అనుసంధానించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పోటీని తట్టుకుని 'జెమినీ' ప్లాట్‌ఫామ్‌తో గూగుల్‌ను ఏఐ రంగంలో ముందుంచుతున్నారని టైమ్ పేర్కొంది.

కళలతో ఆకట్టుకుంటున్న రణ్‌బీర్, వికాస్: 'ఆర్టిస్ట్' విభాగంలో చోటు సంపాదించిన నటుడు రణ్‌బీర్ కపూర్, తన విలక్షణ నటనతో భారతీయ సినిమా అంచనాలను మార్చారని టైమ్ ప్రశంసించింది. ఆయన నటన భారతీయ కథలను ప్రపంచ ప్రేక్షకులకు మరింత దగ్గర చేసిందని పేర్కొంది. మరోవైపు చెఫ్ వికాస్ ఖన్నా కేవలం వంటల నిపుణుడిగానే కాకుండా మానవతావాదిగా, సాంస్కృతిక రాయబారిగా గుర్తింపు పొందారు. ఆహారాన్ని విభిన్న సంస్కృతుల మధ్య వారధిగా ఉపయోగిస్తూ, భారతీయ సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని కొనియాడింది. ప్రముఖ చెఫ్ ఎరిక్ రిపర్ట్ మాట్లాడుతూ.. "వికాస్ ప్రభావం ఇతరులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో, వారిని కనెక్ట్ చేయడంలో ఉంది" అని అన్నారు. న్యూయార్క్‌లోని తన 'బంగ్లో' రెస్టారెంట్ ద్వారా ఆహారానికి జ్ఞాపకాలను, వారసత్వాన్ని జోడించి కథలు చెబుతున్నారని వివరించారు. ఈ జాబితాలో యూట్యూబ్ సీఈఓ నీల్ మోహన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, జపాన్ తొలి మహిళా ప్రధాని సనే టకాయిచి, నేపాల్ యువ ప్రధాని బాలేంద్ర షా వంటి పలువురు ప్రపంచ నేతలు, ప్రముఖులు కూడా ఉన్నారు.

# పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ క్యాడెట్లకు ఘన వీడ్కోలు

## శిక్షణ పూర్తిచేసుకుని లెఫ్టినెంట్ హోదా పొందిన ఏ.ఎన్.ఓ. అజయ్ కుమార్ కు సత్కారం



పటాన్ చెరు (తెలంగాణ వాణి) హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు గురువారం హృదయ పూర్వక వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో, గీతంతో పాటు, దేశానికి వారు అందించిన ఆదర్శ ప్రాయమైన సేవ, అంకితభావం, క్రమశిక్షణల ను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పట్టభద్రులవుతున్న క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్.సీ.సీ. శిక్షణ యొక్క నిజమైన విలువ కేవలం 'సి' సర్టిఫికేట్ సంపాదించడం వరకే పరిమితం కాదని చెప్పారు.

'ఇది మీకు స్థైర్యం, క్రమశిక్షణ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ గుణాలే దేశానికి అర్థవంతంగా సేవ చేసేందుకు మీకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గౌరవ అతిథులుగా హాజరై, పట్టభద్రులవుతున్న క్యాడెట్ల అంకిత భావాన్ని, వారి సేవను ప్రశంసించారు.

ఈ సందర్భంగా, అసోసియేట్ ఎన్.సీ.సీ. ఆఫీసర్ (ఏ.ఎన్.ఓ) లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కికుమార్ తన శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి, లాంఛనంగా ఆ హోదాను స్వీకరించినందుకు అతిథులు ఆయనను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో, పట్టభద్రులవుతున్న క్యాడెట్లు తమ ఎన్.సీ.సీ. ప్రస్థానం ఎంత గొప్పదో పంచు కోగా, జూనియర్ క్యాడెట్లు తమ కృతజ్ఞతలు, అభినందనలను తెలియజేశారు. పట్టభద్రులవుతున్న క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు. ఎన్.సీ.సీ. విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన వీడియో, అలాగే మరపురాని క్షణాలను చిత్రీకరించిన ఆడియో-విజువల్ ప్రజెంటేషన్, ఈ కార్యక్రమానికి గత స్మృతులను జోడించాయి. క్యాడెట్లు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు, ఆసక్తికరమైన కార్యకలాపాలు ప్రేక్షకుల మన్ననలను పొందాయి. సీనియర్ క్యాడెట్ల వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం గ్రూపు ఫోటో, విందుతో ఈ చిరస్మరణీయ వేడుక ముగిసింది.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలుచేయాలి



## అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల: ఏప్రిల్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లాలో నిర్వహించనున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మండల స్థాయి సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని సూచించారు. మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో గురువారం మేడిపెల్లి మండలంలోని పి.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయగ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈరోజు జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారిగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై అర్హులైన ప్రజలకు ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. జగిత్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, మేడిపెల్లి మండలం స్పెషల్ ఆఫీసర్ సురేంద్ర కుమార్, తహసీల్దార్ మునిందర్, ఎంపీడీవో గంగాధర్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం లో మౌలిక సదుపాయాలను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్





భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) జూలూరుపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి, అనంతరం కరివారిగూడెం గ్రామంలో తాగునీటి పరిస్థితిని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మాయిశ్చర్ మిషన్, తూకం యంత్రాలు, గ్రేడింగ్ యంత్రాలు తదితర సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం కొనుగోలు వివరాలు, ప్రస్తుత సీజన్ అంచనాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగుల నిల్వలపై సమాచారం సేకరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. అనంతరం కరివారిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించిన కలెక్టర్, తాగునీటి సరఫరాలో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. వేసవి కాలం మొత్తం తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, ఏప్రిల్ 16 : (తెలంగాణ వాణి ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం సిరికొండలోని ఎ.జీ.దాస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మండల సభలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో సభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ఒక్కో పథకం వారీగా అధికారులు వెల్లడించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకతను చాటారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన ప్రయోజనాల గురించి సభలో తమ అభిప్రాయాలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించిప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500/-కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని భరోసా కల్పించారు. తొలివిడత ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తుది దశకు చేరాయని, త్వరలోనే ప్రభుత్వం రెండవ విడత కింద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని అన్నారు. గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేయనుందని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న యంత్రలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ పథకం కింద కల్టివేటర్లు, రోటవేటర్లు వంటి వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై సమకూరు స్తోందని అన్నారు. రైతులకు లాభదాయకంగా ఉండేలా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పీ.ఓ)లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ప్రతి గ్రామ పంచాయతీని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్





జూలూరుపాడు (తెలంగాణ వాణి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జూలూరుపాడు రైతు వేదికలో గురువారం మండల స్థాయి సభను నిర్వహించారు. ఈ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించగా, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో రహదారుల భద్రత అరైవ్ అ లైవ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, మిషన్ భగీరథ, ఇరిగేషన్, మహిళ సంఘాలు వంటి వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను అధికారులు సభలో తెలియజేశారు. అనంతరం సర్పంచులు తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రక్రియ వేగవంతమవుతోందన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించడం, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు విధులు సమర్థంగా నిర్వహిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నిర్దేశిత మెనూను కచ్చితంగా పాటించేలా పాఠశాలల్లో పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యను మధ్యలో ఆపివేసిన (డ్రాప్‌అవుట్) విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్చే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, వేసవి తీవ్రత దృష్ట్యా ప్రధాన కూడళ్లలో, కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందించేలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చేయూత వంటి సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని అన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ వ్యవస్థ కీలకమని, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం మోడల్ గ్రామపంచాయతీలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. రహదారి భద్రతపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వినూత్న ఆలోచనలతో ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనంతారం గ్రామంలో భూగర్భ జలాల్లో అధిక ఫ్లోరైడ్ సమస్య కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్, గ్రామానికి సురక్షితమైన మంచినీటి సరఫరా కల్పించే దిశగా మిషన్ భగీరథ అధికారులను తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి , అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com